క్లుప్తంగా

సామాజిక తనిఖీ గ్రామసభలు



గ్రామసభలో నివేదికను వివరిస్తున్న డీఆర్పీలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధిహామీ పథకం కింద జరిగిన పనులు, నిధుల ఖర్చుపై ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. బోక్కస్‌గాం, ఖాజాపూర్, గరిడెగాం, జంలతండా, గైర్హాన్‌తండా, సూర్యతండా పంచాయతీల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ జరిగింది. ఎస్‌ఆర్పీ రాజు ఆధ్వర్యంలో డీఆర్పీలు తనిఖీ నివేదికను గ్రామసభల్లో చదివారు. కార్యక్రమంలో ఏపీఓ బస్వరాజ్, టీఏలు, కూలీలు పాల్గొన్నారు.

డంపు కంపు మాకొద్దు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 124వ రోజుకు చేరాయి. ఆదివారం నల్లవల్లి గ్రామంలో రిలే నిరాహార దీక్షలో స్థానిక వృద్ధులు, మహిళలు పాల్గొన్నారు. డంప్‌యార్డు కంపు మాకొదంటూ నినాదాలు చేశారు. స్థానికుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు ఆపే వరకు నిరసనలు కొనసాగుతాయిన స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు, దాతలు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామంలో పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణానికి ఆదివారం గ్రామస్తులు దాతలతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దైవ కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న దాతలకు గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు విజయ్‌గౌడ్, నాయకులు రాజీవ్‌గౌడ్, జగన్‌రెడ్డి, మానిక్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

సంగారెడ్డి టౌన్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుంటున్నానని 100కు ఫోన్ చేశాడు. స్పందించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యువకుడి కాపాడారు. ఈ సంఘటన సంగారెడ్డి మండలం పసల్వాది గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యూసుఫ్ అనే వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నారని 100 డయల్ చేయగా కానిస్టేబుళ్లు మహేందర్, మేషక్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని కాపాడి.. కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం యూసుఫ్ బాబాయ్ మౌలానకు అప్పగించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నిజాంపేట్ మండలం నాగధర్‌కు చెందిన చిన్న నాయకుని బాలయ్యకు రూ. 60 వేలు, పెద్దశంకరంపేట్ మండలం టెంకటికు చెందిన జింక కాశిరాంకు రూ. 27 వేల చెక్కులు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అంజయ్య, అడివప్ప, గోవింద్, రాజు, సాయిలు, నాగగౌడ్, రాంగోండ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి : ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంగారెడ్డి డిపో ఆవరణలో ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి బి.మురళీధర్ హాజరయ్యారు. రీజినల్ కార్యదర్శి బీకే మూర్తి ఆధ్వర్యంలో డిపో అధ్యక్షుడిగా ఎండీ. జానిమియా, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి నర్సింలు ఎన్నికయ్యారు.

మాజీ జెడ్పీచైర్మన్ రామకృష్ణ మృతి

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దండే రామకృష్ణ (76)మృతి చెందారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయన స్వస్థలం జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామం. నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, 1986 నుంచి 1991 వరకు ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా సేవలందించారు. అదే సంవత్సరంలో ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. జిన్నారం జెడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. ఈ ప్రాంతం నుంచి న్యాయవాదిగా ఆయనకు మంచి గుర్తింపు పొందారు.

పైప్‌లైన్ లీకేజీ.. వృథాగా తాగునీరు



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి హద్నూర్ గ్రామంలో పైప్‌లైన్ లీకేజీ కావడంతో తాగు నీరువృథాగా పోతోంది. బస్టాండ్ సమీపంలో ఉన్న బోరు ద్వారా గ్రామంలోని ఆయా వార్డుల ప్రజలకు తాగునీటి సరఫరా అవుతోంది. లీకేజీని అరికట్టేందుకు పంచాయతీ సిబ్బంది బోరు వద్ద గోతిని తవ్వించారు. తవ్విన గోతిని పూడ్చకపోగా లీకేజీకి మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో లీకేజీ నీరు గోతిలో నుంచి పైప్‌లైన్ ద్వారా మళ్లీ ప్రజలకు సరఫరా అవుతుంది. దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీని అరికట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తునారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

సన్నబియ్యంపై ఆసక్తి

వడివడిగా పంపిణీ

- మూడు నెలల కోటతో ఆనందం



రేషన్ దుకాణంలో పంపిణీ చేస్తున్న సన్నబియ్యం

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పథకానికి లబ్ధిదారుల నుంచి మంచి స్పందన వస్తోంది. దొడ్డు బియ్యం పంపిణీ సమయంలో చాలా మంది తీసుకునేందుకు ఆసక్తి చూపే వారు కాదు. ఏప్రిల్ నుంచి ప్రారంభించిన సన్నబియ్యం తీసుకునేందుకు ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతున్నారు. మొదటి రోజు నుంచి రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. గతంతో పోలిస్తే 25 శాతం మంది ఎక్కువ మంది లబ్ధిదారులు తీసుకుంటున్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే..

నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. ఆహార భద్రత కార్డులో పేర్లు నమోదైన ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున, అంత్యోదయ కార్డు కల్గిన వారికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు లబ్ధిదారుడికి 10 కిలోల బియ్యం పంపిణీ చేస్తారు.

రేషన్ బియ్యం అమ్మేవాళ్లు..

ఇది వరకు రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. అన్నం దొడ్డుగా అవుతుందని తినడానికి కొంత మంది ఇష్టపడే వారు కాదు. రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకుని తరువాత మార్కెట్‌లో కిలో రూ.10 నుంచి 20లకు అమ్ముకునే వారు. కొన్ని సంవత్సరాలగా ఈ తంతు కొనగుతోంది. ప్రజల నుంచి వ్యాపారులు బియ్యం సేకరించి లారీలో సరిహద్దులు దాటించే వారు. రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడి.. కేసులు అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రజలు దొడ్డు బియ్యం తినడంలేదని, వ్యాపారులు అమ్ముకుంటున్న విషయం తెలుసుకుని ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్ నెల నుంచి ఈ పథకం ప్రారంభం అయింది. అప్పటి నుంచి మార్కెట్‌లో బియ్యం అమ్మిన సంఘటనలు లేవు.

ఒకేసారి మూడు నెలల కోటా

వర్షకాలం కాలం కారణంగా లబ్ధిదారులకు ఇబ్బంది కల్గకుండా ప్రభుత్వం మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీకి సిద్ధమైంది. రేషన్ బియ్యం తీసుకునేందుకు దుకాణాల వద్ద రద్దీ కనిపిస్తుంది. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తున్న క్రమంలో సాంకేతిక సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. మూడుసార్లు వేలి ముద్ర వేయడం, మూడు బియ్యం తూకం వేయడం వల్ల పంపిణీలో జాప్యం జరుగుతుంది. జిల్లాలో 3,81,000 రేషన్ కార్డులు ఉండగా 13,08,400 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి నెల సుమారు 8,333 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కాగా మూడు నెలలకు సంబంధించి 25,000 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు.

బియ్యం బాగున్నాయి

గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం ఏమాత్రం నాణత్యగా ఉండేవి కావు. ప్రస్తుతం ఇస్తున్న సన్నబియ్యం చాలా బాగున్నాయి. సన్న బియ్యం అమ్ముకోకుండా వండుకుని తింటున్నాం. పేదలు ఎంతో ఉపయోగకరంగా ఉంది. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడం సంతోషంగా ఉంది.

– పద్మమ్మ, జహీరాబాద్

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్ చెరు): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన వందరోజుల ప్రణాళికలో భాగంగా తెల్లాపూర్‌లో నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణాన్ని ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వృక్ష సంపదను కాపాడుకోవాలని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు ఒక మొక్కనైన నాటాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మంజుల, తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు



త్వరలో తెరుచుకోనున్న రైల్వేగేట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి, వెలిమెల గ్రామాల మధ్య రైల్వేగేట్‌ను త్వరలో తెరవనున్నట్లు మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రాంబాబు గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైల్వే అధికారులు కొన్ని నెలలుగా రైల్వేగేట్ మరమ్మతుల పేరిట మూసేశారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గ్రామస్తులు ఈ విషయాన్ని ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. రెండు మూడు రోజుల్లో రైల్వే గేటును తెరవనున్నట్లు చెప్పారు. ఎంపీ రఘునందన్ రావుకు ఇరు గ్రామల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అవయవదానం .. మహాదానం

అవయవదాతల సంఘం ప్రధాన కార్యదర్శి గురుప్రకాష్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గురుప్రకాష్

హత్నూర(సంగారెడ్డి): అన్ని దానాల కల్లా మనిషి అవయవదానం ఎంతో గొప్పదని తెలంగాణ రాష్ట్ర శరీర అవయవదానాల సంఘం ప్రధాన కార్యదర్శి గురు ప్రకాష్ అన్నారు. ఆదివారం హత్నూర మండలం నస్తీపూర్ గ్రామంలో మహిళా సంఘం భవనంలో శరీర అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గురుప్రకాష్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు ప్రాణం పోయే ముందు ఆ క్షతగాత్రుడి శరీరభాగాలు మరో 18 మంది ప్రాణాలు నిలబెట్టగలవన్నారు. అవగాహన లేక చాలా మంది శరీరాన్ని భూమిలో పూడ్చి పెట్టి మట్టి పాలు చేస్తున్నారని తెలిపారు. మరికొందరు దహనం చేసి బూడిద పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి సామాజిక సేవకర్త వెంకట్‌రెడ్డి అవయవాలను దానం చేస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడపతి రవికుమార్ మా ట్లాడుతూ యువత ఏడాదికి కనీసం 4 సార్లు రక్త దానం చేయాలన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు మీర్చే రక్తం వారికి 15 రోజుల జీవితాన్ని ఇస్తుందన్నారు. శరీర అవయవ దాతల సంఘం సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ వెంకోబా మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు 5మందికి ఒక శరీరం అవసరం ఉంటే 50మందికి ఒక్క శరీరం దొరకడం లేదన్నారు. అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో శరీర అవయవదాతలు పెరిగే అవ కాశం ఉందని అన్నారు. మృగశిర కార్తె పండుగను పురస్కరించుకుని, వృద్ధులకు పండ్లు, ఇంగువ బెల్లం, గుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మ హిళా సంఘం అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి అక్ష య, వీఓఏ ప్రవీణ్, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, హ నుమాన్ సేవా సంఘం భక్తులు, మహిళా సంఘం సభ్యులు, దివ్యాంగులు, వాలంటీర్లు సాయిలు, మణిరత్నం, సాయికుమార్, పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని వెల్టూర్‌లో ఆదివారం పార్వతీ పరమేశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా చేశారు. ఆలయంలో పార్వతీ దేవి, లింగం, నందీశ్వరుడు, లక్ష్మీగణపతి, సరస్వతీ, సుబ్రమణ్యస్వామి, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శివయోగి శివాచార్య మహాస్వాముల వారిచే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: రాష్ట్రంలోని ప్రతి పేదవారికి సొంత ఇంటి కల నెరవేర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని జాడీమల్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం తెచ్చామన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్ రెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజాపతి జిల్లా కార్యదర్శిగా సతీష్

సంగారెడ్డి క్రైమ్: తెలంగాణ ప్రజాపతి ఉమ్మడి మెదక్ జిల్లా కన్వీనర్‌గా సంగారెడ్డికి చెందిన కుమ్మరి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాస్ శనివారం అధికారికంగా ప్రకటించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సతీష్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజాపతి నాయకులు కుమ్మరి సతీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పెళ్లి వేడుకల్లో విదేశీ జంట సందడి



జహీరాబాద్‌లో పెళ్లికి హాజరైన జర్మనీ దంపతులు

జహీరాబాద్: పెళ్లి వేడుకలో విదేశీ జంట సందడి చేసింది.. ఇండియాలో జరిగే వివాహానికి జర్మనీ దేశానికి చెందిన దంపతులు జహీరాబాద్‌కు వచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో చిన్న హైదరాబాద్ గ్రామానికి చెందిన అభిషేక్‌రెడ్డి వివాహం అదితితో జరిగింది. అభిషేక్‌రెడ్డి ప్రస్తుతం నెదర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. గతంలో ఓ కంపెనీలో ఉద్యోగం చేసిన సమయంలో జర్మనీకి చెందిన దంపతులతో అభిషేక్‌రెడ్డికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో వారిని వివాహానికి ఆహ్వానించారు. మిత్రుడి పెళ్లికి హాజరు కావడం జీవితంలో మర్చిపోని తీపిగుర్తుగా ఉండిపోతుందని విదేశీ అన్నారు.



జిన్నారం: రాళ్లకత్వ చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులు



నారాయణఖేడ్: పట్టణంలో విక్రయిస్తున్న చేపలు



సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ గౌని వద్ద



జోగిపేటలో చేపల కోసం ఎగబడ్డ స్థానికులు

మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం మార్కెట్లలో రద్దీ పెరిగింది. జిల్లాలోని చేపల మార్కెట్లు ప్రజలు, వ్యాపారస్తులతో కిక్కిరిశాయి. కొరమీను కిలో రూ.650, బొచ్చ, బంగారుతీగ చేపలు కిలో రూ.200, 150కి విక్రయించారు. మృగశిర కార్తె సందర్భంగా చేపలు తినే ఆనవాయితీతో ప్రజలు ఎంత ధరయినా లెక్కచేయకుండా కొనుగోళ్లు చేశారు.

నిజాంపూర్‌లో చేప మందు పంపిణీ



చేప మందును వేస్తున్న మహిళ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ఆడెం మనోహర్ సోదరులు మృగశిర కార్తె నేపథ్యంలో ఆదివారం చేప మందు ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. రంగారెడ్డి, వికారాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయం నుంచి ప్రజలు తరలివచ్చారు. దగ్గు, దమ్ము, ఎలర్జీ, ఉబ్బసం బాధితులు పెద్దసంఖ్యలో తరలివచ్చి చేప మందు ప్రసాదాన్ని తీసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వీరి కుటుంబం గత 46సంవత్సరాలుగా దాదాపుగా మూడు లక్షల మందికి ఉచితంగా చేప మందును పంపిణీ చేస్తూ సేవలందిస్తున్నారు. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్చండి



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

నారాయణఖేడ్: మండల పరిధి వెంకటాపూర్, జూకల్, జూకల్ తండా, చందాపూర్, సత్తెగామ, రుద్రారం గ్రామాల్లో ఆదివారం బడిబాట నిర్వహించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోటుపుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన సదుపాయం, ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణ, గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పిల్లలందరినీ సర్కారు బడుల్లోనే చేర్పించాలని హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు హమీద్, గురునాథ్, చంద్రశేఖర్, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వివరించారు.

ఐక్యమత్యంగా ఉంటేనే గుర్తింపు

కాంగ్రెస్ నేత నీలం మధు



నీలం మధును సన్మానిస్తున్న నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: ఐక్యమత్యంతో ముందుకు సాగితే సమాజంలో గౌరవం దక్కుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముదిరాజ్ సంఘం భవనం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ కులగణనతో మన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే అధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు అంతారాజకీయంగా బలపడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మల్లేశ్, చంద్రకళగోపాల్, సాధువు మల్లేశ్, నాయకులు రాములు, యాదగిరి, మన్నే రవీందర్, రత్నాల దశరథ్, జ్ఞానేశ్వర్, జిత్తయ్య, శ్రీశైలం, మల్లేష్, పాండు, శివ, కిషోర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ఆటోడ్రైవర్లతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు : నియోజకవర్గం పరిధిలోని ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో పటాన్‌చెరుకు చెందిన జీఎంఆర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు దస్తగిరిని ఉపాధ్యక్షుడిగా నియమించడంతో ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఆటో డ్రైవర్లకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. అనంతరం దస్తగిరిని అభినందించారు. డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.